క్లుప్తంగా

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో...) టమోటా 23. వంకాయ 23, బెండ 23, పచ్చిమిర్చి40, కాకర 32, బీర 23, కాలిఫ్లవర్ 18, క్యాబేజీ 15, కారెట్ 35. దొండ 28, ఆలు 21, ఉల్లి 28, గోకర 23, దోస 28, సొర 13, పొట్ల 18, అరటి 11, చిక్కుడు 45, అర్వి 33, మునగ 28, చిలగడదుంప 47, బీట్‌రూట్ 21, కీర 28, ఫ్రెంచ్ బీన్స్ 50, కాప్సికమ్ 33. ఈ ధరలు బుధవారం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

బస్సు ఎక్కండి.. బహుమతి పట్టండి

నేడు ఆర్టీసీ ప్రయాణికులకు రాఖీ లక్కీ డ్రా ద్వారా బహుమతుల ప్రదానం

హయత్‌నగర్: ఆర్టీసీ ప్రయాణికులను ప్రోత్సహించేందుకు ఎండీ సజ్జనార్ సూచన మేరకు పండుగలు, ఇతర ప్రత్యేక రోజులలో ప్రయాణికులకు లక్కీ డ్రా ద్వారా బహుమతులు అందజేయనున్నట్లు హయత్‌నగర్-1 డిపో మేనేజర్ రఘు తెలిపారు. రాఖీ పండుగను పురస్కరించుకుని బుధ, గురువారాల్లో బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికులకు లక్కీ డ్రా ద్వారా బహుమతులు అందజేస్తామన్నారు. ప్రయాణికులు తమ బస్సు టికెట్ వెనుక ఫోన్ నెంబర్ రాసి హయత్‌నగర్ బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన లక్కీ డీప్ బాక్స్‌లో వేయాలని, లాటరీ ద్వారా ఎంపికైన వారికి బహుమతులు అందజేస్తామని తెలిపారు.

31న సామూహిక సత్యనారాయణ వ్రతాలు

సైదాబాద్: మనోభీష్టాలు నెరవేర్చుకునేందుకు సత్యనారాయణ వ్రతం ఆచరించడం మన సంప్రదాయమని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ యడవల్లి శ్రీ రామచంద్రమూర్తి అన్నారు. మంగళవారం ఐఎస్‌సదన్ డివిజన్ లక్ష్మీనగర్ కాలనీలోని ఆలయ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ, ఈనెల 31న ఆలయంలోని భక్తసమాజంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శ్రావణ పౌర్ణమి సందర్భంగా నిర్వహించే వ్రతాల్లో పాల్గొనే వారికి ఆలయ కమిటీ వారే పూజా సామాన్లు అందజేస్తారని తెలిపారు. వ్రతం అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేస్తామన్నారు. వివరాలకు సెల్ నెం: 9849569626లో సంప్రదించాలని కోరారు.

ఫుడ్ కమిషన్ చైర్మన్‌కు సన్మానం



శ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న రఘునందన్‌రెడ్డి

మలక్‌పేట: తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్‌గా నియమితులైన గోలి శ్రీనివాస్‌రెడ్డిని మంగళవారం మూసారంబాగ్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు చెల్లూరి రఘునందన్‌రెడ్డి ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ప్రభుత్వం శ్రీనివాస్‌రెడ్డికి తగిన గుర్తింపు ఇచ్చినందుకు హర్షం వ్యక్తం చేశారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్

నాగోలు: ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కాలనీలో రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ అన్నారు. కొత్తపేట డివిజన్ ఎస్ఆర్ఎల్ కాలనీలో మంగళవారం ఆయన అధికారులతో కలిసి సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు సుధాకర్, సెక్రెటరీ శ్రీనివాస్, యాదయ్య, విరలింగం, రాజేశ్వర్ గౌడ్, వర్క్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కళాకారులకు అభినందన



సాక్షి, సిటీబ్యూరో: తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం రాష్ట్రపతి భవన్‌లో గిడుగు వెంకట రామ్మూర్తి జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మైత్రి కుటీర్ బాలికల కూచిపూడి నృత్యం ఆకట్టుకుంది. కాలనీ ప్రెసిడెంట్ మేక మహేందరెడ్డి వీరిని అభినందించారు. మరెన్నో ప్రదర్శనలు ఇవ్వాలని ఆకాంక్షించారు. కళాకారుల నృత్య గురువు విజయలక్ష్మితో పాటు కళాకారులను ఘనంగా సత్కరించారు.

బీజేపీలోనే మహిళలకు సముచిత స్థానం



సమావేశంలో మాట్లాడుతున్న వనతి శ్రీనివాస్



మాట్లాడుతున్న ఈటల రాజేందర్

- మహిళా మోర్చా జాతీయ అధ్యక్షులు వనతి శ్రీనివాస్
- రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువు: ఈటల రాజేందర్

నాగోలు: భారతీయ జనతాపార్టీ మహిళలకు సముచిత స్థానం కల్పిస్తుందని, గిరిజన మహిళను రాష్ట్రపతిగా ఎంపిక చేసి ఘనత బీజేపీకే దక్కుతుందని బీజేపీ జాతీయ మహిళా మోర్చా అధ్యక్షురాలు వనతి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం నాగోల్ శుభం కన్వెన్షన్‌లో భారతీయ జనతా మహిళా మోర్చా రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వనతి శ్రీనివాస్ మాట్లాడుతూ బేటీ బచావో బేటీ పడావో పథకంతో ఆడపిల్లల విద్యాభ్యాసానికి బాటలు వేశామన్నారు. జనధన్ ఖాతాలతో మహిళలకు ఆర్థిక స్వావలంభన కల్పించినట్లు తెలిపారు. చంద్రయాన్-3లో మహిళా సైంటిస్టులు తమ ప్రతిభను నిరూపించుకున్నారన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ మహిళలకు అవకాశం ఇవ్వడం లేదని, బీఆర్ఎస్ పార్టీ సమావేశాల్లో వేదికపై కవిత మినహా ఎవరూ కనిపించరని ఎద్దేవా చేశారు. కేంద్ర క్యాబినెట్‌లో 11 మంది మహిళలకు మంత్రి పదవులు ఇచ్చిన ఘనత ప్రధాని నరేంద్ర మోదీకి దక్కుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలోనూ మహిళలకు మంచి అవకాశం వస్తుందని రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో మహిళా మోర్చా నాయకులకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. బీజేపీ ఎలక్షన్ కమిటీ చైర్మన్, హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ మాట్లాడుతూ చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించినప్పుడే మహిళలకు న్యాయం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో మహిళల భద్రతకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు ముఖ్యమంత్రి చెబుతున్నారని, అయితే నగరం నడిబొడ్డున రక్షకభటులే మహిళలపై దాడులు చేస్తున్నారని ఆరోపించారు. నందవనంలో ఓ బాలికపై గంజాయి బ్యాచ్ కత్తులు చూపించి అత్యాచారం చేయడం దారుణమన్నారు. వితంతు మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం గత ఐదేళ్లుగా పింఛన్లు ఇవ్వడం లేదని ఆరోపించారు. దీనిపై మహిళా మోర్చా ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు గీతామూర్తి ప్రసంగించారు. ఈ సందర్భంగా మహిళలు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో మహిళా మోర్చా నాయకులు నళిని, ఆకుల విజయ, గీతా రాణి, సులోచన, శ్యామల, మాలతి తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించండి



డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ మొద్దులచ్చిరెడ్డి, అధికారులు

ఎల్‌బీనగర్: వర్షాకాలంలో కాలనీలో డ్రైనేజీ సమస్య రాకుండా వాటర్ వర్క్స్ అధికారులు ముందస్తు చర్యలు తీసుకొని ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దులచ్చిరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన డివిజన్ పరిధిలోని విజయపురికాలనీఫేజ్-1 కాలనీలో జరుగుతున్న డ్రైనేజీ పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. భవిష్యత్‌లో అన్ని కాలనీలో డ్రైనేజీ సమస్యలు లేకుండా శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. శివార్లలో కొత్తగా ఏర్పాటైన కాలనీల్లో సమస్య ఎదురవుతుందని త్వరలో అన్ని కాలనీలకు నిధులు మంజూరు చేసి సమస్య లేకుండా చూస్తామన్నారు. కార్యక్రమంలో అధికారులు రాజగోపాల్, భవ్యారెడ్డి కాలనీ వాసులు వెంకటరెడ్డి, విష్ణువర్ధన్, సాయిరాం, శ్రీనివాస్‌రెడ్డి, కామేష్, పవన్‌రెడ్డి, అనిరుద్, గోపాల్, వేణు తదితరులు పాల్గొన్నారు.

షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే బలాల

మలక్‌పేట: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. పంజేషాహలోని కార్యాలయంలో సోమవారం రాత్రి చార్మినార్ మండలానికి చెందిన లబ్ధిదారులకు షాదీ ముబాకర్ చెక్కులను పంపిణీ చేశారు. ఫర్హత్‌నగర్, ఉస్మాన్‌పుర, కట్టెలగూడ, ఆజంపుర, చంచల్‌గూడ ప్రాంతాలకు చెందిన 11 మందికి రూ.11,01, 276 విలువ చెక్కులు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల తహసీల్దార్ నిహారిక, డిప్యూటీ తహసీల్దార్ మహ్మద్ ఆసీఫ్‌ఖాన్, సిబ్బంది, మజ్లీస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

టీటీడీ బోర్డ్ సభ్యులు సామల రాంరెడ్డికి అభినందనలు



సామల రాంరెడ్డిని అభినందిస్తున్న పెండ్యాల నగేష్ తదితరులు

దిల్‌సుఖ్‌నగర్: తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యులుగా నియమితులైన చిత్రా లేఔట్ కాలనీ వాసులు సామల రాంరెడ్డిని మంగళవారం కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు పెండ్యాల నగేష్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాలనీ వాసులు రేగట్టే సుధాకర్ రెడ్డి, కృష్ణారెడ్డి, సద్గుణ, మర్రి సత్యనారాయణ రెడ్డి, లింగారెడ్డి, కిషోర్ రెడ్డి, నర్సింగ రావు, వాణిశ్రీ, శ్రీనివాస రావు, శంకర్, విజయ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు పూర్వ విద్యార్థి వితరణ

విద్యార్థుల సౌకర్యార్థం షెడ్ నిర్మాణం



జగదీష్‌యాదవ్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

మన్సూరాబాద్: తాను చదువుకున్న పాఠశాలకు తన వంతు సహాయాన్ని అందించాలనే సంకల్పంతో ఓ పూర్వ విద్యార్థి పాఠశాలలో షెడ్‌ను నిర్మించడమేగాక విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశాడు. వివరాల్లోకి వెళితే... మన్సూబాద్‌కు చెందిన పోచబోయిన జగదీష్‌యాదవ్ మన్సూరాబాద్ చౌరస్తాలోని ప్రభుత్వ పాఠశాలలో ప్రాథమిక విద్యాభ్యాసం చేశాడు. తాను చదువుకున్న పాఠశాలకు చేయూత నందించాలనే ఉద్దేశంతో విద్యార్థుల సౌకర్యార్థం షెడ్‌ను నిర్మించాడు. మంగళవారం విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశాడు. పాఠశాల ప్రదానోపాధ్యాయురాలు సరిత జగదీష్‌యాదవ్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, రజిత, ఆంజనేయులు, మిత్రులు సుధాకర్‌రెడ్డి, గోపినాయక్, బుచ్చిబాబు, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

'ఉన్నతి' శిక్షణ కార్యక్రమం ప్రారంభం

మలక్‌పేట: పిల్లలందరూ ప్రతి సబ్జెక్టుపై ప్రావీణ్యం సంపాదించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సైదాబాద్ మండల డిప్యూటీ ఈఓ తిరునగరి రాధాకృష్ణ అన్నారు. మలక్‌పేట ఉన్నత పాఠశాలలో మంగళవారం హిందీ సబ్జెక్టుపై హైస్కూల్ ఉపాధ్యాయులకు ×ఉన్నతి శిక్షణ× కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఉపాధ్యాయుడు అభ్యాసనాన్ని పాఠశాలలో కూడా విజయవంతం చేయాలని కోరారు. మూడు రోజుల పాటు శిక్షణ కొనసాగుతుందన్నారు.



మాట్లాడుతున్న డిప్యూటీ ఈఓ రాధాకృష్ణ

కుల సంఘాలపై ఉన్న శ్రద్ధ అంగన్‌వాడీ కేంద్రాలపై లేదు



మహిళలతో మాట్లాడుతున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: రాష్ట్ర ప్రభుత్వానికి కుల సంఘాలపై ఉన్న శ్రద్ధ అంగన్‌వాడీ కేంద్రాలపై లేదని జీహెచ్ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. మంగళవారం ఆయన భాగ్యనగర్‌కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పదేళ్లుగా చిన్న గదిలో అంగన్‌వాడీ కేంద్రం కొనసాగుతున్నా పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారం రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా లబ్ధిదారులకు అందడం లేదని ఆరోపించారు. ఎక్సైజ్‌శాఖకు ప్రభుత్వ స్థలాన్ని కేటాయించి భవన నిర్మాణానికి నిధులు కేటాయించిన ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రం భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఎక్సైజ్‌శాఖకు కేటాయించిన స్థలం పక్కనే ఉన్న ప్రభుత్వ స్థలాన్ని అంగన్‌వాడీ కేంద్రానికి కేటాయించి భవన నిర్మాణానికి చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్ బాలమణి, గర్భిణీ మహిళలు రూపమ్మ, పుష్పమ్మ, యాదమ్మ, వరమ్మ, విజయలక్ష్మి, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

చేతి సంచుల పంపిణీ



చేతి సంచులను పంపిణీ చేస్తున్న జక్కిడి ప్రభాకర్‌రెడ్డి

మన్సూరాబాద్: జక్కిడి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని కూరగాయల సంతల వద్ద మంగళవారం ఉచితంగా చేతి సంచులను పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతి డివిజన్‌లో 5వేల సంచులను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బుడ్డ సత్యనారాయణ, ఎర్రంబెల్లి సతీష్‌రెడ్డి, పృధ్వీరాజ్, భరత్‌యాదవ్, రమేష్, స్వామి, వీరేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలు అమలు చేయాలి



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నాయకులు

హుడాకాంప్లెక్స్: ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఎల్‌బీనగర్ నియోజకవర్గం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎస్వీ కృష్ణప్రసాద్ ఆరోపించారు. మంగళవారం సరూర్‌నగర్ మండల తహసీల్దార్ కార్యాలయంలో కందుకూరు ఆర్డీఓ సూరజ్‌కుమార్‌కు ఆయన వినతిపత్రం అందజేశారు. కృష్ణప్రసాద్ మాట్లాడుతూ.. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో బీఆర్ఎస్ ప్రభుత్వ విఫలమైందని విమర్శించారు. లేని యెడల నియోజకవర్గం వ్యాప్తంగా నిరసనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వెంకట్‌గాంధీ, తెలుగుయువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ మురళీధర్‌గౌడ్, టీఎస్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్, ఐటీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, మహిళా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణవేణిరెడ్డి, డివిజన్ అధ్యక్షుడు చంద్రశేఖర్, విజయ్‌నేత, భిక్షపతి, గిరియాదవ్, గౌతమ్, మల్లేష్ ఉన్నారు.

కఠోర శ్రమతోనే పోలీసు ఉద్యోగం సాధ్యం



ఎస్ఐ హర్షను సత్కరిస్తున్న అకాడమీ సభ్యులు

హుడాకాంప్లెక్స్: పోలీసు ఉద్యోగాలు సాధించాలంటే చదువుతో పాటు శారీరక కఠోర శ్రమ ఎంతో ముఖ్యమని ఫిజికల్ డైరెక్టర్ నందు నాయక్ తెలిపారు. నందు ఆర్మీ అకాడమీలో శిక్షణ తీసుకున్న విద్యార్థి, హర్ష ఢిల్లీలో ఎస్ఐగా ఎంపిక కావడంతో మంగళవారం హర్షను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నందునాయక్ మాట్లాడుతూ.. ఢిల్లీలో ఉద్యోగం సాధించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అకాడమీలో ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు శిక్షణ తీసుకుంటున్నారని సలహాలు, సూచనల కోసం హర్షను తీసుకురావడం జరిగిందన్నారు. వాళ్లకి ఒక ఆదర్శంగా ఉంటుందని వాళ్ల సమక్షంలోనే ఎస్ఐగా ఎంపికైన హర్షను నందు ఆర్మీ అకాడమీకి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో కాకుండా కేంద్రంలో కూడా సత్తా చాటుతున్నారని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడానికి అకాడమీ ఎల్లప్పుడు ముందుంటుందని అన్నారు. శిక్షణ తీసుకున్న విద్యార్థులు నిజాయతీగా కష్టపడితే ఉద్యోగం సాధించడం ఏమీ కష్టం కాదని వాళ్లకు సూచనలు ఇచ్చారు.

డ్రైవర్‌పై దాడి..కారుతో పరారీ

నాగోల్: కారు డ్రైవర్‌పై ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేసి కారు తీసుకుని పారిపోయిన సంఘటన నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి..చాంద్రాయణగుట్టకు చెందిన అజామ్ కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి అతను బోడుప్పల్ నుంచి చాంద్రాయణగుట్టకు వెళుతున్నాడు. నాగోల్ ఫ్లైఓవర్ వద్దకు రాగానే స్విగ్గీ డెలివరీ బాయ్ కారు ఆపి, తనకు ఒక పర్స్ దొరికిందని, అందులో ఉన్న నెంబర్‌కు ఫోన్ చేయాలని కోరాడు. దీంతో అజామ్ సదరు నెంబర్‌కు ఫోన్ చేయగా ఓ వ్యక్తి ఆ పర్స్ తనదేనని 20 నిమిషాల్లో అక్కడికి వచ్చి తీసుకుంటానని తెలిపాడు. దీంతో అజామ్ అతడి కోసం ఎదురు చూస్తుండగా, అదే సమయంలో బైక్‌పై అక్కడికి వచ్చిన ఇద్దరు వ్యక్తులు అజామ్ పై దాడి చేసి డబ్బులు డిమాండ్ చేశారు. అతను డబ్బులు లేవని చెప్పడంతో కారు తీసుకుని వెళ్లి పోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నాగోల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదకరంగా మాసబ్ చెరువు తూము



తూము నుంచి లీక్ అవుతున్న నీరు

తుర్కయంజాల్: మాసబ్ చెరువు తూముకు ప్రమాదం పొంచి ఉంది. మంగళవారం ఉదయం నుంచి నీరు పొంగి బయటకు ప్రవహిస్తున్న పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. నాలుగేళ్లుగా తూము నుంచి నీరు వృథా పోతున్నా ఇరిగేషన్ అధికారులు మరమ్మతులు చేపట్టలేదు. దీంతో చెరువుకు అనుకుని ఉన్న కాలనీలకు ముప్పు సమస్య తప్పడం లేదు. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంపై సాక్షి ఇరిగేషన్ ఏఈ గంగమ్మ దృష్టికి తీసుకువెళ్లగా తూమును పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

ఘనంగా శివాని మహిళా కళాశాల ఫ్రెషర్స్ డే



సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి

సాక్షి,సిటీబ్యూరో: ఎల్‌బీనగర్ డివిజన్, కొత్తపేటలోని శివాని మహిళా డిగ్రీ కళాశాల 23వ ఫ్రెషర్స్ డే వేడుకలు మంగళవారం కర్మన్‌ఘాట్‌లోని కేకే గార్డెన్స్‌లో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ పల్లె రాంరెడ్డి మాట్లాడుతూ గత 23 ఏళ్లుగా కళాశాల మహిళా సాధికారికతకు కృషి చేస్తున్నదన్నారు. కార్యక్రమంలో కళాశాలల సెక్రెటరీ సుదర్శన్ రెడ్డి ,డైరెక్టర్లు పి. వెంకట రమణా రెడ్డి, ఎస్. సాంబశివరావు, టి. ప్రేమ్‌నాథ్ రెడ్డి, బి. సుదర్శన్ రెడ్డి, ఒమెగా విద్యా సంస్థల సెక్రెటరీ ఎస్. సీతారామ రెడ్డి,కళాశాలల ప్రిన్సిపాల్ అనిత తదితరులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థుల

వక్ఫ్ బోర్డు సమస్యకు పరిష్కారం చూపుతాం



మేయర్‌ను కలిసిన జేఏసీ ప్రతినిధులు

బోడుప్పల్: బోడుప్పల్ నెలకొన్న వక్ఫ్ బోర్డు సమస్యను ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రులు కేటీఆర్, చామకూర మల్లారెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చూపుతామని బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి అన్నారు. వక్ఫ్ బోర్డు బాధితుల సంఘం జేఏసీ ప్రతినిధులు మంగళవారం మేయర్ సామల బుచ్చిరెడ్డి, పార్టీ అధ్యక్షులు మంద సంజీవ్‌రెడ్డిని కలిసి వారి గోడును వెళ్లబోసుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ బుచ్చిరెడ్డి మాట్లాడుతూ వక్ఫ్ బోర్డు సమస్యతో చాలా కుటుంబాలు ఇబ్బంది పడుతున్నాయని, ఇదే విషయమై మంత్రి మల్లారెడ్డికి వివరించగా, ఆయన ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు వెల్లడించారు. మరోసారి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యేవిధంగా చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు. మేయర్‌ను కలిసిన వారిలో జేఏసీ కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి, కోర్ కమిటీ మెంబర్స్ ప్రమోద్‌కుమార్, సీతారామరాజు, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌బీనగర్‌ను రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతా

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



సాగర్‌రింగ్ రోడ్డులో ఫ్లై ఓవర్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

హస్తినాపురం: ఎల్‌బీనగర్ నియోజకవర్గాన్ని తెలంగాణ రాష్ట్రానికే రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని ఎల్‌బీనగర్ శాసన సభ్యుడు దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన సాగర్‌రింగ్ రోడ్డులో నిర్మిస్తున్న స్కై ఫ్లైఓవర్ పనులను లింగోజిగూడ మాజీ కార్పొరేటర్ ముద్రబోయిన శ్రీనివాస్‌రావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్కై ఫ్లైఓవర్ పనులను వేగవంతం చేసేందుకు అధికారులు, కాంట్రాక్టర్ చర్యలు తీసుకోవాలన్నారు. ఎల్‌బీనగర్ చౌరస్తాను ఇప్పటికే సిగ్నల్ ఫ్రీ చౌరస్తాగా తీర్చిదిద్దామని , ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడం మూలంగానే ఇది సాధ్యమైందన్నారు. ఎస్ఆర్‌డీపీ పనుల్లో భాగంగా దాదాపు రూ. 658 కోట్ల వ్యయంతో పనులు చేపడుతున్నామని, ఎల్‌బీనగర్‌లో ఫ్లై ఓవర్లు, అండర్ పాస్ పనులు , ఎల్‌బీనగర్ జంక్షన్ వద్ద కుడి, ఎడమ ఫ్లై ఓవర్లు అండర్‌పాస్‌లు, నాగోల్ ఫ్లైఓవర్‌లు, కామినేని జంక్షన్ దగ్గర రెండు ఫ్లైఓవర్లు , అలేఖ్య టవర్స్ జంక్షన్ వద్ద రెండు ఫ్లై ఓవర్లు నిర్మించడం జరిగిందన్నారు. అలేఖ్య టవర్స్ వద్ద నూతన స్కై ఫ్లైఓవర్ నిర్మాణ పనులు అక్టోబర్ నెలాఖరులోగా పూర్తవుతాయని తెలిపారు. కరోనా సమయంలో ఎన్నో కఠిన నిర్ణయాలు తీసుకున్నందునే రోడ్డు విస్తరణ, ఫ్లైఓవర్ నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయగలిగామన్నారు. పనుల్లో కొన్ని అడ్డంకులు ఎదురైనా ఎవరికి భయపడకుండా వారిని ఒప్పించి రోడ్డు వెడల్పు పనులు పూర్తి చేశామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. తొమ్మిదేళ్లలో జరిగిన అభివృద్ధిని చూసి ప్రతిపక్షాలు ఓర్వ లేకపోతున్నాయని, తెలంగాణలో చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను దేశంలో అమలు చేసేందుకు బీఆర్ఎస్ పనిచేస్తుందన్నారు. కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. పార్టీని మరింత బలోపేతం చేసి రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించి మరోసారి రాష్ట్రంలో కేసీఆర్ పాలన కొనసాగించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో రాకేశ్‌గౌర్ తదితరులు పాల్గొన్నారు.